క్లుప్తంగా

ఘనంగా అన్నమయ్య జయంతి



అన్నమయ్య స్వరార్చనలు చేస్తున్న కళాకారులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బలగ హరే రామ మందిరంలో తాళ్లపాక అన్నమాచార్యుల 617వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరునికి అష్టోత్తర శతనామావళి పూజ, అనంతరం 30 మంది గాయనీ, గాయకులతో శ్రీవారికి స్వరార్చన వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ సింహాద్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తన జరిగింది. అలాగే అన్నమయ్య కీర్తనలకు భరతనాట్య ప్రదర్శనలు జరిగాయి. కార్యక్రమంలో సుసరాపు లక్ష్మీగణపతి శర్మ, పెంకి నాగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, నారాయణశెట్టి వెంకట కిరణ్ కుమార్, విశాఖ దయా ఆస్పత్రి డైరెక్టర్ వీఆర్ ఆర్.పద్మజా, పాట్నూరు యోగిత, శార్వాణి, జె.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



వేతనదారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని రాగోలు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద వేతనదారులకు స్థానిక సర్పంచ్ గేదెల చెంగళరావు శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ స్వరూపారాణి, ఎంపీడీవో బొడ్డేపల్లి శైలజ, పంచాయతీ కార్యదర్శి తిరుమలదేవి తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ కేంద్రం తనిఖీ

రణస్థలం: ఆర్థికంగా మహిళలకు తోడ్పాటు ఇచ్చేందుకు ఉచిత కుట్టు మిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు తెలిపారు. ఏపీ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ వారి సహకారంతో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శిక్షణలో శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో జే.ఆర్.పురం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథోత్సవం

గార: మండలంలోని పలు గ్రామాల్లో సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథం శనివారం పర్యటించింది. సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా దేశమంతటా రథోత్సవం పర్యటనల్లో భాగంగా బూరవెల్లి, పూసర్లపాడు, కొత్తపేట, బోరవానిపేట, గార, తూలుగు, గోరువానిపేట, సతివాడ, యాళ్లపేట, శ్రీకూర్మం, సొండిపేట గ్రామాల్లో రథయాత్ర సాగింది. రథానికి గ్రామాల్లో భక్తులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన వృద్ధుడు

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం పంచాయతీ పరిధి సింహద్వారం సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి అపస్మారంగా పడి ఉన్నాడు. దీంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. దీంతో అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ వృద్ధుడు శనివారం మృతి చెందాడు. ఆస్పత్రి వైద్య నివేదిక ఆధారంగా ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిస్తే 63099 90816 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ వి.సందీప్‌కుమార్ కోరారు.

మెట్టవలసలో ఇంటింటా సర్వే

జి.సిగడాం: మండలంలోని మెట్టవలస గ్రామంలో గ్రామ దేవత పండగ అనంతరం ప్రజలకు ఎటువంటి రోగాలు రాకుండా ఉండేందుకు ముందుస్తు చర్యలు తీసుకుంటున్నామని వైద్యులు డాక్టర్ బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు అన్నారు. శనివారం గ్రామంలో సర్పంచ్ కామోజుల అరుద్ర, ఎంపీటీసీ బెవర విజయలక్ష్మి అధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు కలిసి ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టారు. గ్రామంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు సైతం చేపట్టినట్లు వెల్లడించారు.

పీఎన్‌కాలనీలో చోరీ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని పీఎన్‌కాలనీలో శనివారం రాత్రి చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. పీఎన్‌కాలనీ బాలభారతి జంక్షన్‌లోని శ్రీసాయి సత్య రెసిడెన్సీ అతి సమీప గోవెల్ బ్యూటీ పార్లర్ పైఫ్లోర్‌లో నివాసముంటున్న దుర్గ, నందు దంపతుల ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఘటనా స్థలికి రెండో పట్టణ ఎస్ఐ సంతోష్‌కుమార్, సిబ్బంది చేరుకుని నివాస గృహాన్ని, చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించారు. ఇదే విషయమై రెండో పట్టణ సీఐ వద్ద ప్రస్తావించగా జత చెవిదిద్దులు, నాలుగు తులాల పట్టీలు, ఓటీపీ, కొంత నగదు చోరీకి గురైనట్లు చెప్పారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మాణాలకు బ్రేకులు..!



చిలకపాలేంలో నిలిచిన పాఠశాల భవనాల పనులు

- పురోగతి లేని ప్రభుత్వ భవనాలు
- నిలిచిపోయిన నిర్మాణాలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ఓలేటి అగ్రహారంలో అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం



ఎచ్చెర్లలో నిలిచిన గ్రామ సచివాలయ భవనం పనులు

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను నాడు – నేడు పనులతో సమూలంగా మార్చే ప్రక్రియను చేపట్టారు. అలాగే ప్రతి పంచాయతీలోనూ గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. అప్పట్లో వీటి నిర్మాణాలకు సంబంధించి పనులు చకచకా సాగాయి. కొన్నిచోట్ల సాంకేతికపరమైన ఇబ్బందులు, ఇతరత్రా కారణాలు వలన పనులు ఆగిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం రాగానే ప్రభుత్వ భవనాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎక్కడి నిర్మాణాలు అక్కడే అసంపూర్తిగా మిగిలిపోయాయి.

పనులు ప్రారంభించాలి



ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పనులు ప్రారంభించాలి. లేదంటే భవనాలు అసంపూర్తిగానే శిథిలావస్థకు చేరుతాయి. ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టిన నిర్మాణాలు నిలిపివేయడం సరికాదు. ఇప్పటికైనా స్పందించి పూర్తిచేసి, వినియోగంలోకి తీసుకురావాలి.

– దుంప చిన్నారెడ్డి, సంతసీతారాంపురం

ఎచ్చెర్ల నియోజకవర్గంలో...

ఎచ్చెర్ల నియోజకవర్గంలో 122 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీల్లో పదుల సంఖ్యలో సచివాలయ భవనాలు, పాఠశాలల భవనాలు, అంగన్‌వాడీ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక నిలిచిపోయిన భవనాలకు నిధులు మంజూరు చేయడం లేదు. ఫలితంగా ప్రభుత్వం వచ్చి ఏడాదైనా పనులు కనీసం ముందుకు సాగడం లేదు. పిల్లర్లు, లిట్లు, స్లాబ్ ఇలా పలు దశల్లో భవన నిర్మాణాలు ఆగిపోయి ఉన్నాయి. దీంతో నిర్మాణాలు పాడవ్వడం, పిచ్చి మొక్కలు పెరగడం జరుగుతోంది. ముఖ్యంగా ఎచ్చెర్లలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లీనిక్ భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. చిలకపాలేంలో రూ.18 లక్షల అంచనాతో ప్రారంభించిన నాడు – నేడు పనులు ఆగిపోయాయి. ఓలేటి అగ్రహారం, ముద్దాడ తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. స్థానిక నాయకులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి అనేకసార్లు ఈ విషయాన్ని తీసుకెళ్లినా ఫలితంగా లేకుండా పోయింది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఎచ్చెర్ల నియోజకవర్గంలో అసంపూర్తి భవనాల పరిస్థితిని ఉన్నత అధికారులు దృష్టికి తీసుకెళ్లాం. భవనాలు పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. భవన నిర్మాణాలు పూర్తి చేసేందుకు మా పరిధిలో కృషి చేస్తున్నాం.

– సనపల శ్రీరాములు, పంచాయతీరాజ్ డీఈ

బిల్లులు చెల్లించాలి



నిలిచిపోయిన భవనాల పరిస్థితిని ప్రభుత్వం అధ్యయనం చేయాలి. రావాల్సిన బకాయి బిల్లులు చెల్లించాలి. భవనాల పూర్తికి నిధులు మంజూరు చేయాలి. ప్రజా అవసరాలు గుర్తించి ముందుకు సాగాలి.

– అల్లు సూర్యనారాయణ, రామజోగిపేట

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న దృశ్యం

రణస్థలం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పంచాయతీరాజ్ మండల విస్తరణ అధికారి వి.ప్రకాష్‌రావు అన్నారు. మండలంలోని పైడి భీమవరంలో గ్రామ పంచాయతీ, హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పంచాయతీలో రోడ్లుకు ఇరువైపులా మొక్కలు నాటుతామన్నారు. అలాగే పాలిథిన్ వినియోగం తగ్గించేలా చర్యలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.అజయ్‌బాబు, హరిత సొసైటీ అధ్యక్షుడు ఆర్.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రైతులకు అన్యాయం



మాట్లాడుతున్న ప్రభాకరరావు

శ్రీకాకుళం అర్బన్: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలోని రైతులకు అన్యాయం జరుగుతోందని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు ధ్వజమెత్తారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో ఆర్భాటాలు చేసి, అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నివర్గాల ప్రజలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాకి చెందిన కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవసాయ శాఖ మంత్రిగా ఉండి కూడా ఇక్కడి రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అంతా మోసాలమయమని దుయ్యబట్టారు. సమావేశంలో స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ వడ్డి నాగేశ్వరరావు, మీసాల బాబురావు, స్టేట్ కిసాన్ కాంగ్రెస్ మెహతాబ్ ఖురేషి, డీసీసీ జనరల్ సెక్రటరీ, ఇచ్ఛాపురం ఇన్‌చార్జి మాసుపత్రి చక్రవర్తిరెడ్డి, ఎచ్చెర్ల ఇన్‌చార్జి అబోతుల వెంకట్ నాయుడు, నరసన్నపేట ఇన్‌చార్జ్ మామిడి సత్యనారాయణ, జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ తెంబూరు మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక గ్రామంలో పారిశుద్ధ్య పనులు శనివారం చేపట్టారు. వీధుల్లో ఉన్న చెత్తను ట్రాక్టర్లు ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. సర్పంచ్ పెయ్యిల నాగమణి మాట్లాడుతూ ప్రజలంతా చెత్తను ఎక్కడబడితే అక్కడ పడేయకుండా చెత్త కుండీల్లో వేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ గోపాలరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో సాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ బి.గోపాలరావు తెలియజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జలవనరుల శాఖ, ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగునీటి సమస్య గుర్తించి అంచనాలు ఇంజినీరింగ్ విభాగం తయారు చేయాలన్నారు. ఈ మేరకు ప్రత్యేక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సాగునీటి కాలువల్లో ఇసుక మేటల తొలగింపు, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే షట్టర్లు, మదుముల మరమ్మతులు చేపడతామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పీవీఎస్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం..!

- విలీన పంచాయతీల్లో అవస్థలు
- రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం నగర పరిధిలోని విలీన పంచాయతీలైన వంశధారనగర్ కాలనీ, పద్మావతి నగర్ కాలనీ ప్రజలు సరైన రోడ్డులేక నానా అవస్థలు పడుతున్నారు. 20 ఏళ్లుగా సుమారు రెండువేల కుటుంబాలు స్థానికంగా నివాసం ఉంటున్నప్పటికీ రోడ్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికంగా నివాసం ఉన్నవారంతా ఉద్యోగ, వ్యాపారస్తులే కావడంలో రోడ్లు లేకపోవడంతో ద్విచక్రవాహనాలు, కార్లు సైతం పరాయిపంచన ఉంచాల్సిన దుస్థితి ఏర్పడింది. పొరపాటున ఈ రెండు కాలనీల్లో వర్షాలు పడితే ఈ ప్రాంతమంతా వర్షపునీటితో నిండిపోతుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ కాలనీలకు రోడ్డు వేయాలని ప్రతిపాదనలు జరిగినప్పటికీ, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్డు పనులను పక్కన పడేశారు. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి వంశధార నగర్ కాలనీ, పద్మావతి నగర్ కాలనీలకు రోడ్డు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



కాలనీలకు ఇరువైపులా తుప్పలు



వంశధారనగర్ కాలనీ రోడ్డు దుస్థితి



పద్మావతి నగర్ రోడ్డు

అధికారులకు విన్నవించాం



మేము స్థానికంగా నివాసం ఉంటున్న కాలనీకి రోడ్డు వేయాలని చాలాసార్లు అధికారులకు విన్నవించాం. గత ప్రభుత్వం హయాంలో రోడ్డు మంజూరైయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అది పూర్తిగా మూలకు చేరుకుంది. రోడ్డు లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కల్లోంచి పాములు, విష కీటకాలు సైతం ఇంట్లోకి వస్తున్నాయి.

– సనపల శ్రీనివాస్, చాపురం

రాకపోకలకు ఇబ్బంది



వర్షం పడితే మా కాలనీ చెరువును తలపిస్తుంది. ఎక్కడికక్కడే నీరు నిల్వ ఉండిపోతుంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మా కాలనీ సమస్యలపై ప్రజలంతా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలకు సైతం వినతులు అందించాం.

– కె.రమేష్, పద్మావతినగర్

పరిశీలిస్తాం

రోడ్డులేని కాలనీలను పరిశీలిస్తాం. కాలనీలకు ఇరువైపులా రోడ్డుమార్గంలో ఉన్న పిచ్చి మొక్కలు సైతం పూర్తిగా నిర్మూలిస్తాం. కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– పీవీవీడీ ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం

పౌష్టికాహారం తీసుకోవాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత



ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌వో అనిత తదితరులు

అరసవల్లి: ప్రస్తుత జీవన శైలిలో పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు శారీరక వ్యాయామం నిత్యం అలవాటు చేసుకోవడంతో రక్తపోటు ఇబ్బందులు తప్పుతాయని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ అనిత అన్నారు. శనివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లు నిండినవారిలో కూడా 25 శాతం మందికి రక్తపోటు సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. దీనికి వ్యాయామం చేయకపోవడమే ప్రధాన కారణమని గుర్తించామన్నారు. ప్రతి ఒక్కరూ వారంలో 5 రోజుల పాటు కనీసం 40 నిమిషాల పాటు వ్యాయాయం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం రక్తపోటు నివారణ సూచనలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ కేథరిన్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు దుస్తులు అందజేత



దుస్తులు అందజేస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక గ్రామంలో నాలుగు పూరిళ్లు అగ్ని ప్రమాదానికి దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బాధితులను శనివారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

అనంతరం వారికి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మీసాల సీతంనాయుడు, బొంతు సూర్యనారాయణ, రాజీనాయుడు, పెయ్యిల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల దాహార్తి తీర్చడమే ధ్యేయం



ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చిన ప్రయాణికుల దాహార్తిని తీర్చడమే ఆర్టీసీ ధ్యేయమని ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ కె.ఆర్.ఎస్.శర్మ అన్నారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. వడదెబ్బ బారిన పడకుండా ప్రయాణికులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, ఆర్టీసీ ఎస్ఎం ఎంపీరావు, ఆర్టీసీ అధికారి శ్రీను, ఆర్టీసీ పీఆర్వో కె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్‌మెంట్ వయసును పెంచాలి



సమ్మెలో పాల్గొన్న ఇంజినీరింగ్ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల రిటైర్‌మెంట్ వయసుని 60 సంవత్సరాల నుంచి 62కి పెంచాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.శ్యామలరావు, ఆర్.సతీష్‌లు కోరారు. శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె 3వ రోజు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ యూనియన్ నాయకులు శంకరరావు, మణి, ఆది, ముకేష్ యాదవ్, మజ్జి శ్రీను, దేవి, జయశ్రీ, రాజేశ్వరి, సతీష్, రాఘవ, చిన్నరాము, శశి, త్రినాథ, రాయ్ శంకర్, రానా శ్రీను, విశ్వాసజగదీష్, బోస్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శలు



రణస్థలం: పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్



శ్రీకాకుళం రూరల్: నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు తదితరులు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని సానివాడ ఎంపీటీసీ సభ్యుడు రుప్ప అప్పలసూరి తల్లి అమ్మన్నమ్మ ఇటీవల మరణించారు. దీంతో వారి కుటుంబాన్ని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రణస్థలం: మండలంలోని కొవ్వాడ గ్రామంలో ఆకుల సూర్యనారాయణ తల్లి ఇటీవల మరణించారు. దీంతో ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు మాజీ ఎంపీటీసీ మైలపల్లి రాముడు, నాయకులు మైలపల్లి కృష్ణ, రాముడు, నాగేంద్ర, ఎర్రయ్య, నరేంద్ర, సింహాచలం తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పలువురు అన్నారు. జిల్లావ్యాప్తంగా శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అలాగే చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయకుండా, చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్తంగా..

ఆర్టీసీ కార్మికుల హక్కులను కాపాడాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆర్టీసీ కార్మికుల హక్కులను కాపాడాలని, ఆర్టీసీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా అడ్డుకోవాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరణం తిరుపతి నాయుడు శనివారం ఒక ప్రకటనలో కోరారు. అద్దె బస్సుల స్థానంలో ప్రభుత్వం బస్సులు కొనుగోలు చేసి నడపాలన్నారు. కార్మికుల రిక్రూట్‌మెంట్ చేపట్టాలని, శాఖాపరమైన వేధింపులు లేకుండా చూడాలని విన్నవించారు.

ఎట్టకేలకు రేషన్ పంపిణీ

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని లక్ష్మీపురం పంచాయతీలో ఎట్టకేలకు రేషన్ సరుకులు శనివారం పంపిణీ చేశారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన డీలర్ దల్లి రమణమ్మ కందిపప్పు పంపిణీలో అవకతవకలకు పాల్పడిందనే ఆరోపణల నేపథ్యంలో తలెత్తిన వివాదంతో సరుకుల పంపిణీ ఆగిపోయింది. అయితే ఇటీవల గ్రామానికి విచ్చేసిన రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. అయితే గ్రామంలో రేషన్ సరుకులను ఎట్టి పరిస్థితిల్లోనూ అందజేయాలని కలెక్టర్, జేసీలు ఆదేశించడంతో యుద్ధ ప్రాతిపదికన పంపిణీ చేశారు. తహసీల్దార్ మంగం రాజశేఖర్ దగ్గరుండి పర్యవేక్షణ చేశారు. వారితో పాటు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సుధారాణి, ఆర్ఐ రాపర్తి అప్పలరాజు, వీఆర్వో మల్లేశ్వరరావు, రత్నాకర్‌లు ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

జి.సిగడాం: రైతుల భూ సమస్యల పరిష్కారమే లక్ష్యమని తహసీల్దార్ ఎం.సరిత అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కలెక్టర్ గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అబోతుల రాధ, సర్వేయర్ శాంతారావు, ఉమాపట్నాయక్, భూపతి నరింగరావు తదితరులు పాల్గొన్నారు.